

# అనురాగపు సంకెళ్ళు

—ఆదివిష్ణు

సాయంత్రం బీచి మనోహరంగావుంది. వీక్ దే అవడం వల్లకాబోలు ఎక్కువ జనం లేరు. అయినా క్షణక్షణానికీ జనం ఎక్కువవుతూనే వున్నారు. రోజూ చూస్తూన్నా. సముద్రుడిలో సౌందర్యం తగ్గిపోగా రోజురోజుకీ ఎక్కువౌతూ జనుల్ని మరింత ఆకర్షిస్తోంది.

విసుగ్గా అప్పుడప్పుడుగడియారం చూసుకుంటూ నిరీక్షిస్తున్నాడు భాస్కర్ శశికళకోసం, అప్పుడే అయిదున్నర! అయిదింటికే వస్తానన్న శశికళ యింకా రాకపోవడానికి అతనికి కారణం కన్పించడంలేదు. అసహనం ఎక్కువయిపోతూంటే లేచినిల్చొని యిటూ అటూ పచార్లుచెయ్యడం సాగించాడు.

దూరంగా శశికళ కన్పించగానే అతడి మొహంలో ఆనందం తొణక్కుమంది. గబగబా ఆమెకేసి అడుగులు వేశాడు. ఎప్పుడూ చిర్నవ్వు నవ్వుతూ వుండే శశికళ ఆ రోజెందుకో చిన్నబోయి వుంది. భాస్కర్‌ని చూడగానే ఉత్సాహంగా పరుగెత్తు కొచ్చేది. ఈ రోజు అడుగులు వెయ్యడానికే శక్తి లేనట్లు నడుస్తోంది. ముఖమంతా ఎఱ్ఱగా కందిపోయి అలసటని సూచిస్తోంది.

ఆమెను చూడగానే ఆత్రుతతో ఏం శశీ అలా వున్నావ్. వంట్లో బాగా లేదా అంటూ చేతిని పట్టుకొని నాడి చూడసాగాడు. మరోసంవత్సరంలో డాక్టరు పట్టా పుచ్చుకోబోయే భాస్కర్. "భాస్కర్ నీతోపాటూ నేనూ వచ్చే సంవత్సరం డాక్టర్ నవుతాను" అంది నిర్లిప్తంగా నవ్వుతూ శశికళ. "కొందరు డాక్టర్లు తమజబ్బు తాము తెల్సుకోలేరట"." "నావిషయం అలాకాదులే. నేనుబాగానే వున్నాను."

చనువుగా ఆమెచేతిలో చేయివేసి తీసుకెళ్ళాడు భాస్కర్ ఆమెను. ఇద్దరూ ఎదురెదురుగా కూర్చున్నారు. చేతులు మోకాళ్ళ మీద వేసి నేల చూపులు చూస్తూ ముడుచుకున్న గులాబీలా వున్న శశికళని చూస్తూ కూర్చున్నాడు భాస్కర్.

"శశీ"

"ఊఁ"

"నిన్న చెప్పిన విషయం ఏం ఆలోచించావ్?"

శశికళ ఏమీ మాట్లాడలేదు.

"నాకు మన చదువయిపోయేముందు పెళ్ళి చేసుకోవాలని లేదుశశీ! కానీ నా పరిసితి నీకు తెలుసుకదూ! మా బామ్మ ఈరోజో రేపో అనేలా వుంది. నా పెళ్ళి కళ్ళతో చూడాలని ఎంతో ఆశిస్తోంది. విస్మయంగా చూసింది శశికళ.

"అలా వీలు పడదేమో అని నాకెంతో అనుమానం భాస్కర్"

"ఎందుక్కాకూడదు శశీ?"

"మా కుటుంబ పరిస్థితి నీకు తెలిసిందేకదూ! నన్ను డాక్టరీ చదివించడానికి యింట్లో వాళ్ళెంత కష్టపడుతున్నారు! బి. యస్ సి, పాసైన అక్క పైకి చదవకుండా స్కూల్ టీచరు ఉద్యోగం చేస్తూంది. తల్లిలేని పిల్లలని అల్లారు ముద్దుగా పెంచిన మా నాన్నగారు రిటైరయినా మళ్ళీ వేరే పనిలో చేరారంటే వాళ్ళు నాకోసం ఎంత త్యాగం

చేస్తున్నారో తెలుస్తూంది."

"నన్ను పెళ్లాడతానంటే మీవాళ్లు వద్దంటారా శశీ! నాలో ఏమైనా లోపంవుందా? మా నాన్నగారే వచ్చి సంప్రదింపులు జరిపిస్తారు కదా!"

"అటువంటి అనుమానం లేదు భాస్కర్. నే నిప్పుడు పెండ్లాడతానంటే ఎవరూ ఏమీ అడ్డు పెట్టరు. పైగా సంతోషిస్తారేమో కూడా!...

అయినా నే నాపని చెయ్యలేను భాస్కర్. తిన్న యింటి వాసాల్నే లెక్కపెట్టలేను." ఎదురుగా భాస్కర్ ఉన్నాడన్న విషయం మరచిపోయి స్వగతం పల్కుతున్నట్లు మాట్లాడసాగింది శశికళ.

"లలితక్కయ్య కప్పుడే ఇరవైఏడు సంవత్సరాలు. ఇంకా పెళ్ళవలేదు. పెద్దది తనుండగా తగుదునమ్మా అంటూ నే నెలా పెళ్ళి చేసుకోగలను? అయినా అక్కయ్యేం పాపం చేసింది? అనాకారిగా జన్మించడం ఆమె తప్పా? రూపాన్ని ప్వక పోయినా భగవంతుడు తక్కిన సుగుణాలన్నింటినీ ఆమెలో రూపొందించాడే! కలిమిఏండిన యీ కలియుగంలో అందానికి మాత్రం ప్రాధాన్యత నిస్తుండే మనుష్యులకి అక్కలోని గుణసౌందర్యం కన్పించడంలేదు. దానికి అక్కెంత కుమిలి పోతోందో! నాన్నెంత బాధపడుతున్నారో! అయినా ఒక్కరోజయినా నా దగ్గర తనబాధ చెప్పుకోలేదు. ప్రతి విషయంలోనూ నన్ను ప్రోత్సహిస్తోంది. అలాంటపుడు ఆమెని వదలి నే నెలా వివాహం చేసుకోగలను...."

హఠాత్తుగా భాస్కరాన్నిచూస్తూ అంది శశికళ.

"ఎన్నాళ్ళనించో యీ విషయం నీకు చెప్పాలని ప్రయత్నిస్తున్నాను భాస్కర్. కానీ వీలుపడలేదు. ఈ నాడు సమయం వచ్చింది.నాలోని అగ్నిభాండం బ్రద్దలౌతోంది." గద్గద గొంతుతో అంది శశికళ.

"అక్కయ్యెలాంటిదో నీకు తెలుసా భాస్కర్! అమృత హృదయినే! నేను నీ విషయం చెప్పి నప్పుడేమందో తెలుసా?

'నేను చాలా సంతోషిస్తున్నాను శశీ. నువ్వయినా ఒక యింటిదానివి అవుతున్నందుకు. కానీ మన అభిమానానికీ, ప్రతిష్ఠకూ, వంశ గౌరవానికీ మచ్చతెచ్చే పనేదీ చెయ్యవ్ గదూ! అలాంటి సందర్భంలో తల్లి స్థానంలో నేనుండి నీక్కావల్సి నవన్నీ జరిపిస్తాను.' ఈ మాటలు చెపుతున్నప్పుడు అక్కయ్య పెదవులపై చిరునవ్వే వెలుగుతున్నా, ఆ చిరునవ్వు వెనకాల హృదయం బాధతో మెలికలు తిరుగుతోందనీ నవ్వుతున్న కళ్ళవెనుక ఇంకి పోయిన కన్నీళ్ళున్నాయని, నా భుజాన్ని తట్టే ఆ చేతుల్లో రక్తనాళాలు బిగుసుకుపోతున్నాయనీ నాకు తెలుసు. రాత్రిళ్లు నిద్ర పట్టక ఆమె మంచం మీద పొర్లుతుంటే నేను చూశాను. అటువంటి అక్కయ్యని విధికొదిలేసి, నేను నా సుఖాన్ని చూసుకోనా భాస్కర్!"

ఏం చెప్పడానికీ తోచలేదు భాస్కర్‌కి.

"నువ్వన్నదంతా నిజమే శశీ, నేనూ ఒప్పుకొంటున్నాను. కానీ నా పరిస్థితీ ఆలోచించు.ఇపుడు మా బామ్మ ఆత్మశాంతి చెందాలంటే ఆవిడ కళ్ళెదుట యిపుడు నేను పెళ్ళిచేసుకోక తప్పదు. చిన్నప్పట్నుంచీ కూడా తల్లికంటే మిన్నగా చూస్కొంటున్న బామ్మకోసం నే నామాత్రం చెయ్యక్కర లేదా!"

"భాస్కర్,"

అవును శశీ నాకోసం ఆమాత్రం చెయ్యలేవా!"

"లేదు భాస్కర్ నాకూ బాధగానే వుంది. కానీ ఏం చెయ్యడం. మా అక్కయ్యకి నే నన్యాయం చెయ్యలేను."

"అందుకోసం నీ జీవితమే నాశనం చేస్కుంటావా! ఇద్దరం కల్సి ఎన్ని ఊహాసౌధాలు నిర్మించుకున్నాం. కల్సి వైద్యం చెయ్యాలని ఎన్ని ఆశయాలు ఏర్పరచుకున్నాం! అవన్నీ గాలిమేడలవాల్సిందేనా?"

"అవును భాస్కరం. ఎన్నో కలలు కన్నాం. అంత మాత్రంచేత అన్నీ నిజమయితే మానవ జీవితం యిలా ఎలాగుంటుంది?"

"వేదాంతం మాట్లాడొద్దు శశీ" ధైర్యం చెపుతున్నట్లు ఆమె చేతిని పట్టుకున్నాడు భాస్కర్. "మీ అక్కయ్యకి ఏ లోటూ లేకుండా మనం చూసుకుందాం."

వీలవదు భాస్కర్. స్త్రీకి ఎంత సుఖవంత పరిస్థితులు ఏర్పరచినా, తనకూ ఓ గృహం

•—•—•—•—•—•—•—•—•—•—•—•

"ఎమిటికథ? నామీద అంతకోపంగా ఉన్నావే? రాత్రి ఇంటికివచ్చినప్పుడు విప్పారిన కళ్ళతోచూశావనా?"అని ఉదయం కాఫీతాగుతూన్న భర్త మూతిముడుచుకు కూర్చున్న భార్యని ముద్దుగా అడిగాడు.

"చాల్లెద్దురూ మీవేళాకోళం. విప్పారిన కళ్ళతో చూస్తే మీతో నాకుతగువెందుకు? రాత్రి మీరువచ్చినపుడు అసలు మీరు కళ్ళే తెరవందే." అంది భార్య. కొత్త దూరం జరుగుతూ.

భర్తకప్పుడు జ్ఞాపకంవచ్చింది. తాను కొంత ఎక్కువగా మద్యంపుచ్చుకు వచ్చినట్లు ఇక మాటాడకుండా కాఫీ త్రాగి వెళ్ళిపోయాడు.

•—•—•—•—•—•—•—•—•—•—•—•

అంటూ ఏర్పడేదాకా సుఖించలేదు."

"నువ్వీ రోజింత వింతగా ప్రవర్తిస్తున్నావేం శశీ?"

"ఎప్పటికైనా యిలా జరిగి తీరాల్సిందేగా! మీ బామ్మకి సంతృప్తిని కలిగిస్తూ నువ్వింకో అమ్మాయిని పెళ్ళిచేసుకో భాస్కర్. నాకోసం యెదురు చూస్తే జీవితమే గడిచిపోవచ్చు."

"ఎంత తేలిగ్గా చెప్పావు శశీ! అది అంత సులభంగా సాధ్యపడుతుందనుకున్నావా?"

"వేరే గత్యంతరంలేదు భాస్కర్ నువ్వైనా సుఖపడు."

"మరీ మూర్ఖురాలివై పోయావు శశీ. సుఖపడతాను, పడతేం చేస్తాను. నువ్వు అనుభవిద్దువుగాని సకలైశ్వర్యాలూ"

"ఆవేశ పూరితుడవై పోవద్దు భాస్కర్ ఆలోచించు."

"చాలా సంతోషం శశీ. నాకో పాఠంచెప్పావ్. కానీ ఒకటి జ్ఞాపకం ఉంచుకో శశీ. నువ్వు పెద్ద త్యాగం చెయ్యటంలేదు! నన్ను కాదని నువ్వెప్పటికీ సుఖపడలేవు." అంటూ లేచి ప్యాంటు దులుపుకుని బయలుదేరాడు.

"కానీ జరిగితీరాలి. బామ్మా నా జీవితానికో సమస్య తెచ్చిపెట్టావ్" అంటూ గొణుక్కుంటూ వెళ్ళడం ఆమెకు విన్పించింది.

"సాధారణ మానవుడివి నువ్వేం చెయ్యగలవ్ భాస్కర్" అనుకొంటూ శశికళ తాను కూడా యింటికేసి బయల్దేరింది.

తండ్రికోసం ఎదురుచూస్తున్న లలిత శశికళ యిల్లు చేరడంతోటే ఆమె ముఖాన్ని చూసి ఏదో జరిగిందని తెల్సుకుంది. ఏం మాట్లాడకుండా గదిలోకి వెళ్ళిపోతున్న చెల్లెలిని తనూ వెంబడించింది.

"శశీ ఏం జరిగింది?"

"ఏమీ లేదక్కయ్యా."

"అలాగంటే ఒప్పుకోను. ఏదో జరిగింది చెప్పవూ" తరచి తరచి అడిగేటప్పటికి చెప్పక తప్పలేదు శశికళకి.

అంతా చెప్పేసి "మనమంటే భగవంతుడికి చిన్నచూపు" అన్న శశిని చూడగానే ఆమె చెప్పక పోయినా తన కారణంగానే ఆమె భాస్కర్‌ని నిరాకరించిందని లలిత అర్థంచేస్కుంది. శశీ అంటూ ఆమెను పెనవేసుకుని భోరున ఏడ్చింది. ఇంతవరకు ఆపుకున్నా శశికళకీ కన్నీరు ఆగలేదు. అలా ఒకర్నొకరు పెనవేసుకుని ఏడుస్తూనే వుండిపోయారు చాలాసేపటి వరకూ.

* * *

కళ్ళెంతప్పిన గుఱ్ఱంలా, ఎవరికీ చెప్పకుండా కాలం పరుగెత్తింది. కాలగర్భంలో మరో ఆరు సంవత్సరాలు కలిసిపోయాయి. ఈ కాలంలో లలితకి పెళ్ళవలేదు. శశికళా పెళ్ళిచేసుకోలేదు. కూతుళ్ళమీది బెంగ వారి తండ్రిని కృంగదీయడమే కాక అతని ప్రాణాల్నికూడా బలితీసుకుంది. లలిత యింకా ఆ స్కూల్లోనే టీచరుగా పనిచేస్తూంది. శశికళ ఎమ్ డి పూర్తిచేసింది. డాక్టరుగా మంచి పేరు తెచ్చుకుంది. పేరుతోపాటు డబ్బూవచ్చింది. కాని మనశ్శాంతి కరువైందామెకు.

లలిత స్కూలుకి క్రొత్తగా ఒక మాస్టరు వచ్చారు. జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్టుండే నలభై ఏళ్ళ రంగారావుకి లలితనిచూడగానే ఎందుకో పల్కరించాలనిపించింది.

ఒకరోజు యింట్లో శశికళతో మాట్లాడుతూ ఆయన కథ చెల్లెలికి చెప్పింది లలిత.

'పాపం ఆయన కథ వింటే గుండె తరుక్కుపోతుంది శశీ. ఇన్ని రోజులూ మనమే బాధలు పడుతున్నాం, అనుకుంటాం తరచిచూస్తే ప్రతిఒక్కరిలోనూ బాధ కన్పిస్తుందేమో! అయినా ఏమనిషీ యింకొకరి బాధని పూర్తిగా అర్థం చేస్కోలేదు.

ఎమ్ ఎస్ సి. పాసవగానే ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేకపోయినా, వృత్తిలో కలిగే

మానసికానందాన్ని ఆపేక్షించి ఉపాధ్యాయుడిగా చేరాడు రంగారావు. ఎపుడూ సౌందర్యాన్ని ఆరాధించే మనఃప్రవృత్తి గలవాడు. అందుకు తగినట్లే ఎంతో అందమైన అమ్మాయినిచ్చి కొడుక్కి పెళ్ళి చేశారు అల్లారు ముద్దుగా పెంచిన ఆ తలిదండ్రులు.

నాల్గుసంవత్సరాలు దాంపత్యసుఖం పూర్తిగా అనుభవించాడు రంగారావు. జీవితమంటే అర్థమేమిటో తెల్సింది. పుణ్యం పండినట్లు అతడి భార్య గర్భవతి అయింది.

దైవదర్శనార్థం వేరేవూరు వెళ్తాంటే తలిదండ్రులతో భార్యగూడా వెళ్తానంటే ఆ స్థితిలో ఆమె కోర్కె కాదనలేక "సరే" అన్నాడు రంగారావు.

తిరిగి వస్తున్నామని వాళ్ళిచ్చిన టెలిగ్రాము తీసుకుని స్టేషనుకి వెళ్ళిన అతడికి వారొచ్చే రైలుకి యాక్సిడెంటయిందన్న వార్త పిడుగుపాటే అయింది. ఎదురుచూడని అన్యాయం అతడికి జరిగింది. తలిదండ్రులిద్దర్నీ ప్రమాదంలో కోల్పోయాడు. అపురూప సౌందర్యవతి అయిన భార్య ఒక చేయీ, కాలూ విరిగిపోయాయి. అంతేకాదు వాళ్ళు కట్టుకున్న గాలిమేడలన్నీ విచ్ఛిన్నమయేలా భార్య గర్భవిచ్ఛిత్తి అయింది.

విధి క్రూరత్వానికి బలి అయిన భార్యని ఓదార్చడం అతనికి బ్రహ్మప్రళయం అయింది. కానీ అంతటితో ఆగిపోలేదు. మళ్ళీ విధి క్రూరంగా నవ్వింది. అతని భార్యకు తెల్సు అతడెంతటి సౌందర్యారాధకుడో. తన చేతినీ, కాలునీ చూసుకుంటే ఆమెకే అసహ్యమనిపించేది. జీవితంలో మళ్ళీ ఆమె గర్భవతి ఆయే అవకాశం లేదని డాక్టర్లు చెప్పారు. భర్త యెంత ప్రేమగాచూస్తున్నా ఆమెకి జీవితంపై రుచి నశించింది. ఫలితంగా బలవంతంగా తన ప్రాణాలు తీస్కుంది. భర్తని మాత్రం యీ లోకంలో ఒంటరిగా వదిలేసి. — కొన్ని సంవత్సరాల తరువాత ఆ వూరినుంచి బదిలీ అయింది రంగారావుకి

అక్కనోటినుంచి అతడి కథ విన్న శశికళకి అతని మీద జాలికన్నా, అక్క ప్రవర్తన ఎక్కువ ఆశ్చర్యం కల్గించింది ఎవ్వరికీ చనువివ్వని లలిత అతని జీవితచరిత్రని పూర్తిగావిని సానుభూతిచూపే స్థితికి వచ్చిందంటే యిదరికి మధ్య ఎంతో సాన్నిహిత్యం ఏర్పడివుండాలి.

'ఆరోజునుంచి నేను సుందరమైన వస్తువులను ద్వేషించడం ప్రారంభించానంటే నమ్మండి. మీరు ఏమీ అనుకోకపోతే, మీతో నేనింత స్వేచ్ఛగా మాట్లాడ్డానికి కారణం మీరు మీ సౌందర్యంతో అందర్నీ ఆకర్షించలేక పోవడమే.' అనేవాడతను లలితతో. స్కూల్లో జరిగే ప్రతివిషయమూ శశికళకి తెలిసేది.

అక్కలో రోజురోజుకీవచ్చే మార్పులు శశికళని పెళ్ళి పెద్దగా తయారుచేశాయి.

"మా అక్కయ్యని పెళ్ళిచేసుకుంటారా ?" అని ధైర్యంగా అడిగిన శశికళని ఆశ్చర్యంగా చూశాడు రంగారావు.

"శశికళగారూ! మీరిలా అడుగుతారని నేను కలలోగూడా అనుకోలేదు. నేనే మీ అక్కయ్యని అడుగుదా మనుకుంటున్నాను. ఎందుకో నాకు ఆవిడంటే అభిమానంకల్గింది. కానీ నా కొక్కటే భయం. మీ అక్కయ్యగారు ఒప్పుకుంటారో లేదో, మీకు తెలీదేమో నాకప్పుడే పెళ్ళి అయింది. భార్యావియోగం కూడా కల్గింది."

"మీరేమీ అనుమానాలు పెట్టుకోవద్దు. అక్కయ్యను ఒప్పించే భారం నాది" అంటూ బయలేరింది శశికళ.

"ఇదెలా పరిణమించినా మీ అక్కయ్యని మాత్రం నాతో మాట్లాడ్డం మానేయొద్దని చెప్పండి" అన్నాడు రంగారావు ఆమె వచ్చేస్తూంటే.

"రంగారావంటే నీ అభిప్రాయం ఏమిటోయ్" చిర్నవ్వు దాచుకుంటూ అక్కయ్య నడిగింది శశికళ రాత్రి పడుకోబోయే ముందు.

'ఎందుకూ' అనుకోకుండానే లలిత బుగ్గలు ఎర్రగా అయ్యాయి.

"ఎందుకో నాక్కావాలి చెప్పుదూ" ఆమె ముఖలక్షణాలు అనుకూలంగా ఉండటం గమనించి ఉత్సాహంగా అంది శశికళ.

"ఊహుఁ నే చెప్పను."

"ఎందుకో తెలుసా? మా బావ అయేందుకు ఆయనకు తగిన అర్హతలున్నాయో లేదో తెల్సుకుందామని."

"శశీ!"

"అవునక్కయ్యా, ఎంతకాలం నువ్విలానే వుండిపోతావ్"

"నా సంగతిసరే మరి నీ సంగతో"

"నాకేమయింది. నేను నీకంటే చిన్నదాన్ని. అంతేకాదు. నా వృత్తిలో నన్ను నేను మరిచిపోగలను. సంఘంలో నాకు పేరుంది. ఒక ఉన్నత స్థానముంది. వీటన్నిటితో నా జీవితం గడిచిపోక పోదు."

"చాలా పెద్దదానిలా మాట్లాడుతున్నావ్ శశీ."

"అవునక్కా కావాలనే ఈ సమయంలో పెద్దదాన్నవుతున్నాను. అక్కా నా మీద నీ కోపంగా వుందా? బావకిది రెండో పెళ్ళి."

"ఛఛ! అటువంటి అనుమానం నీకెందుకొచ్చింది శశీ..." లలితకళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. "శశీ నేనుకాదమ్మా నీవే యిపుడు నాకమ్మవయావ్. నా కళ్ళముందే నాకే తెలియనంత ఉన్నతంగా ఎదిగిపోయావ్. కానీ నా శశి యిలా అయిందంటే నాకు సంతోషానికి బదులు ఎందుకో బాధ కల్గుతోంది. నీతో మాట్లాడాలంటే నాలో ఉండే వెయ్యి మాటల్లో ఒక్కటీ బయటికి రావడం లేదు.

"మరీ ఎక్సైట్ అయిపోవద్దక్కయ్యా ఒంటికి మంచిదికాదు"

"ఓహో డాక్టరుని కదూ"

సంభాషణ నవ్వుతూ ముగించినా ఆరోజు రాత్రి యిద్దరక్కచెల్లెళ్ళకీ నిద్దర పట్టలేదు.

తన పెళ్ళికా నూటరెండు డిగ్రీల జ్వరంతో వున్నా పనిలో తనని తాను మరచిపోవాలని

దిండు గలేబులకు, డోరు కర్టెన్లకు డిజైన్ - "హంసద్వయం"



చిత్రం : రమణ

ప్రయత్నిస్తున్న చెల్లెల్ని చూసి చాటుగా కళ్ళు తుడుచు కోడంకంటే ఏమీ చెయ్యలేకపోయింది లలిత.

*   *   *

పెద్ద బంగళా. ముగ్గురూ సంపాదిస్తున్న కుటుంబంలో దేనికీ కొరతలేదు. అందరికీ తెల్సినంత వరకూ వాళ్ళ కుటుంబంలో సుఖ సంతోషాలు వెల్లివిరుస్తున్నాయ్. కానీ అక్కా చెల్లెళ్ళ గుండెల్లో బ్రద్దలయ్యే అగ్ని పర్వతాల గురించి ఎవరికీ తెలీదు చెప్పినా ఎవరూ నమ్మరుకూడా.

రోజంతా తెచ్చి పెట్టుకున్న సంతోషంతో గడిపినా. శశికళగదిలో భాస్కర్ ఫొటో మాత్రం రాత్రి ళ్ళామెకు నిద్ర లేకుండా చేస్తోంది. చెల్లెల్ని చూసి 'ఏ క్షణంలో ఏంచేస్తుందో' అని లలిత భయపడుతూనే వుంటుంది.

ఆ రోజు హాస్పిటల్‌లో 11 గంటల సమయం తన రూమ్‌లో కూర్చొని మెడికల్ జర్నల్ తిరగేస్తోంది శశికళ. "కంగ్రాచ్యులేషన్స్ డాక్టర్ శశికళా!" అంటూ లోపలికొచ్చాడు డాక్టర్ రవికుమార్.

'ఏమయిం' దన్నట్లు ప్రశ్నార్థకంగా ముఖం పెట్టింది శశికళ.

"యూ హావ్ బీన్ సెలెక్టెడ్ టు రెప్రెజెంట్ ది స్టేట్ ఇన్ ది వరల్డ్ డాక్టర్స్ మీట్"

'ఓహో అలానా' పేలవంగా నవ్వింది డాక్టర్ శశికళ.

"ఏమిటీ! మీరింకా అలానే వున్నారు, మాకంతా పార్టీ ఎప్పుడూ"

"అదా! మీ రెప్పుడంటే అప్పుడే"

"ఓకె, అయితే యీ సాయంత్రమే మీ యింట్లో డిన్నర్."

"ఊఁ" అంది శశికళ.

కాసేపు నిశ్శబ్దంగా గడిచింది.

"ఒక్క టడుగుతాను మీరే మనుకోకపోతే" ప్రశ్నార్థకంగా తలెత్తి చూసింది,

"యూ షుడ్‌నాట్ మిస్‌టేక్ మి మీ పర్సనల్ మేటరని అనుకోవద్దు, ఎందుకు మీరెప్పుడు విచారంగా వుంటారు?"

"ఏమీ లేదే"

"మీ రెందుకో దాచాలనుకుంటున్నారు. ఈ విషయం విన్న మీరింకా నిర్లిప్తతతో వున్నారంటే నా కాశ్చర్యం వేస్తోంది. నే నయితే యీపాటికి హాస్పిటల్ అంతా గగ్గోలు చేసేవాణ్ణి."

ఏమీ మాట్లాడలేదు శశికళ.

"పోనీ దీనికయినా జవాబు చెప్పండి. మీ రెందుకింకా వివాహంచేసుకోలేదు. అందమూ, చదువూ, సంపదా అన్నీ ఉన్న మిమల్ని చేసుకోవాలని ఎందరో ముందుకొస్తారే! మీరింకా చేసుకోపోవటానిక్కారణం..."

"ప్లీజ్! ఆ విషయాలు మాత్రం అడగొద్దు. గతంలో కొన్ని బాధాకరమైన సంఘటనలు జరగడమే అందుక్కారణం. అంతకంటె ఎక్కువ నేను చెప్పలేను."

"నేను తెలిసికో కూడదా?"

"అబ్బే అదేంకాదు. నాకే మళ్ళీ ఆ విషయాలు జ్ఞప్తికి తెచ్చుకోవడం యిష్టంలేదు...అయితే నేను యింటికెళ్ళి సాయంత్రంపార్టీకి ఏర్పాట్లన్నీ చేస్తాను" అంటూ తన బ్యాగ్, కోటు తీసుకుని బయటికి నడిచింది రవికుమార్‌ని ఆశ్చర్యంలోనే వదిలేసి.

"కంగ్రాట్యులేషన్స్ డాక్టర్" ఎవరో అన్నారు ఆమె బయట కడుగెట్టిందో లేదో.

"థ్యాంక్స్."

"కంగ్రాట్యులేషన్స్ డాక్టర్."

"థ్యాంక్స్."

"కంగ్రాట్యులేషన్స్..."

అలానే ఆమె హాస్పిటల్ దాటేదాకా ఎందరో అభినందనలు తెల్పుతూనే వున్నారు. ఒక్కొక్కరూ అంటూంటే ఆమెకు సంతోషానికి బదులు కోపమూ, బాధా కలుగుతున్నాయ్. ఆవేశం పొంగిపోతోంది. లోకందృష్టిలో ప్రథమశ్రేణి డాక్టర్ ఆమె. కానీ నిజానికి తన మనస్సుని అదుపులో ఉంచుకోలేని అబల. ఆలోచనలనే అలల తాకిడికి తట్టుకోలేని తామరకాడ. మళ్ళీమళ్ళీ ఆమెకు భాస్కర్‌తోటి జీవితమే జ్ఞాపకం వస్తోంది.

ముసురుతున్న ఆలోచనలతోటే గారేజిలోని కారుతీసి యింటికి బయలుదేరింది. కళ్ళు రోడ్డు మీదున్నాయేకాని, రోడ్డుకి బదులు మనోఫలకం మీద కాలేజీ జీవితాన్ని చూస్తున్నాయ్. కాలు యాక్సిలేటర్‌ని బలంగా నొక్కేస్తూంది. ముల్లు ఇటూ అటూ నిలకడలేకుండా కదులుతోంది.

"... మీ చెల్లెలికి యాక్సిడెంటయింది. హాస్పిటల్‌లో వుంది" అన్న వార్త వినగానే పిచ్చిదానిలా పరుగెత్తింది లలిత. శశికళకి బాగానే దెబ్బలు తగిలాయి. రక్తం చాలా పోవడంవల్ల మనిషి చాలా నీరసించింది. బ్యాండేజీలతోవున్న చెల్లెలిని స్పెషల్ పర్మిషన్‌తో యింటికి తీసుకువచ్చింది లలిత. వాళ్ళతోపాటు రవికుమార్ గూడా యింటికి వచ్చాడు.

"బాగా రెస్ట్ తీసుకోండి. ఏమీ ఆలోచించవద్దు అంత జాగ్రత్తగా డ్రైవ్‌చేసే మీకే ప్రమాదం జరిగిందంటే యీరోజు మీ దృష్టి సరిగ్గా లేదనే అర్థం. విశ్రాంతి తీసుకోండి. మీరూ ఒక డాక్టరే మీ కింతకంటే ఎక్కువ చెప్పనక్కరలేదు" అంటూ సెలవు తీసుకున్నా డతడు.

రవికుమార్ వెళ్ళిపోయిన తరువాత చెల్లెలుగదికి తిరిగివచ్చింది లలిత. శశికళ చెయ్యి తన చేతిలోకి తీసుకుంది.

"శశీ! ఎందుకిలా చేశావ్? నీ అక్కయ్యని ఇంత బాధించాలని నీ కెందుకమ్మా అనిపించింది?" ఆమెకు తెలీకుండానే కన్నీళ్ళు కాలవలు కడుతున్నాయ్.

"ఏడుస్తున్నావా అక్కాయ్. ఎందుకూ? నాకేమీ అవలేదుగా?"

'అవలేదు కాబట్టే సరిపోయింది. ఎందుకు శశీ నీ జీవితాన్ని పరీక్షకు పెట్టావ్?"

'లలితా' బయటనుంచీ రంగారావు గొంతు వినిపించింది. 'పడుకో శశీ ఏమైనా కావలిస్తే పిలు' అంటూ బెడ్‌లైట్ వుంచి బయటికి వెళ్ళిందామె.

రంగారావూ లలితా మెల్లగా మాట్లాడుతున్నా వాళ్ళ మాటలు శశికళకి వినిపిస్తున్నాయ్.

"ఏమిటి లలితా! మరీ పిచ్చిగాప్రవర్తిస్తున్నావ్. అసలే అమ్మాయి వీక్‌గా వుంది. ఓదార్చవల్సిందిపోయి నువ్వే యింకా బాధపెడుతున్నావ్. శశి మనసులోలేని ఆలోచనల్ని ప్రవేశపెడుతున్నావ్!"

"లేదండీ మీకు తెలీదు. నాకూ శశికీ వుండే సంబంధాన్ని మీరెవరూ అర్థం చేసుకోలేరు. మనం యీనాడు యిలా వున్నామంటే దానికి శశే కారణం. ఎన్ని జన్మల్లో నయినా నే దాని ఋణాన్ని తీర్చుకోలేను."

మెల్లిగా టేబుల్ మీదుండే భాస్కర్ ఫోటో చేతికి తీసుకుంది శశికళ.

"అవును భాస్కర్ అంతే! ఇక నా జీవితం కృతజ్ఞతలకీ, సానుభూతులకీ, డిగ్రీలకీ బిరుదులకే మిగిలిపోయింది!" మెల్లిగా వణికే పెదవులతో అంది శశికళ. చేతులు భాస్కర్ ఫొటోని గుండెకి అదుముతూంటే ఆగకుండా వెలువడే కన్నీరు తలగడని తడిపేస్తోంది.

★

